సాక్షి ఖమ్మం

శుక్రవారం । 22 । ఆగస్టు । 2025



కొరత పేరుతో దందా

యూరియా కొరతను సాకుగా చూపుతూ కొందరు వ్యాపారులు ధర పెంచడమే కాక ఇతర ఎరువులను అంటగడుతున్నారు. 8లో



...ప్రారంభం మాత్రమే..

ఉద్యోగ, ఉపాధ్యాయుల సమస్యలపై చేస్తున్న పోరాటం ప్రారంభం మాత్రమేనని యూఎస్‌పీసీ బాధ్యులు వెల్లడించారు. 8లో

వాతావరణం

గరిష్టం / కనిష్టం
34° / 24°

జిల్లాలో శుక్రవారం సాధారణ ఉష్ణోగ్రతలే ఉంటాయి. సాయంత్రం తర్వాత వాతావరణం చల్లబడే అవకాశముంది.

న్యూస్‌రీల్

మెడికల్ కాలేజీలో ప్రారంభమైన ప్రవేశాలు

ఖమ్మంవైద్యవిభాగం: ఖమ్మం ప్రభుత్వ మెడికల్ కళాశాలలో 2025–26 సంవత్సరానికి మొదటి సంవత్సరం విద్యార్థుల ప్రవేశాలు మొదలయ్యాయి. జాతీయ కోటాలో 15శాతం సీట్లు భర్తీ చేస్తుండగా మొదటి విడత కౌన్సెలింగ్‌లో ఐదుగురు చేరారు. ఇందులో కేరళ నుంచి ఇద్దరు, ఏపీ, రాజస్తాన్, ఢిల్లీ నుండి ఒక్కొక్కరు ఉన్నారు. మరో రెండు విడతల్లో జరిగే కౌన్సెలింగ్‌లో మొత్తం సీట్లు భర్తీ కానున్నాయి. ఇక 85శాతం సీట్లు రాష్ట్రస్థాయి విద్యార్థులకు కేటాయించనుండగా, స్థానికత విషయంలో కోర్టులో కేసు ఉండడంతో వచ్చే నెల కౌన్సెలింగ్ ప్రారంభమయ్యే అవకాశముందని ప్రిన్సిపాల్ డాక్టర్ శంకర్ తెలిపారు. కాలేజీలో 100 సీట్లు ఉండగా, వచ్చేనెల 15నుంచి మొదటి సంవత్సరం విద్యార్థులకు తరగతులు ప్రారంభమయ్యే అవకాశముంది.

సీజనల్ వ్యాధులపై అప్రమత్తత



రిజిస్టర్లను తనిఖీ చేస్తున్న డీఎంహెచ్‌ఓ కళావతిబాయి

చింతకాని: వరుస వర్షాలతో సీజనల్ వ్యాధులు ప్రబలే అవకాశమున్నందున ఉద్యోగులు అప్రమత్తంగా వ్యవహరించాలని డీఎంహెచ్‌ఓ కళావతిబాయి సూచించారు. చింతకాని మండలం రామకృష్ణాపురంలోని ఆయుష్మాన్ ఆరోగ్య మందిరాన్ని గురువారం తనిఖీ చేసిన ఆమె మాట్లాడారు. గ్రామాల్లో ఆశా కార్యకర్తలు ప్రతీ రోజు డ్రై డే నిర్వహిస్తూ పరిశుభ్రత ప్రాధాన్యతపై ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. నీటి నిల్వల ప్రాంతాల్లో దోమల నివారణ మందు పిచికారీ చేయించాలని సూచించారు. అనంతరం ఆమె గ్రామంలో నిర్వహిస్తున్న ఫీవర్ సర్వే తనిఖీ చేయగా, గర్భిణుల రిజిస్ట్రేషన్, ప్రభుత్వ ఆస్పత్రుల్లో ప్రసవాల పెంపుపై సూచనలు చేశారు. వైద్యులు అల్తాఫ్, తబుసం, ఏఎన్ఎం జయమ్మ తదితరులు పాల్గొన్నారు.

ఇందిరమ్మ ఇళ్లకు ప్రతీ సోమవారం బిల్లులు



ఇంటిని పరిశీలిస్తున్న డీపీఓ ఆశాలత

ముదిగొండ: ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారులు నిర్మాణాల్లో వేగం పెంచాలని జిల్లా పంచాయతీ అధికారి ఆశాలత సూచించారు. నిర్మాణ దశలకు అనుగుణంగా లబ్ధిదారుల ఖాతాల్లో ప్రతీ సోమవారం బిల్లులు జమ అవుతాయని తెలిపారు. ముదిగొండ మండలంలోని పండ్రేగుపల్లి, ఖానాపురం, న్యూలక్ష్మీపురంల్లో గురువారం ఆమె ఇళ్ల నిర్మాణ పురోగతిని పర్యవేక్షించారు. ఎంత త్వరగా పూర్తి చేస్తే అంతే త్వరగా బిల్లులు జమ అవుతాయని తెలిపారు. ఈ విషయమై అధికారులు పర్యవేక్షిస్తూ లబ్ధిదారులకు అవగాహన కల్పించాలని సూచించారు. ఆ తర్వాత గ్రామాల్లో పారిశుద్ధ్య నిర్వహణపై సూచనలు చేశారు. ఎంపీడీఓ శ్రీధర్‌స్వామి, ఎంపీఓ వాల్మీకి కిషోర్, హౌసింగ్ ఏఈ సతీష్, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

హెచ్‌ఎంల వెబ్‌ఆప్షన్లు పూర్తి

- నేటి నుంచి ఎస్‌జీటీల పదోన్నతులు

ఖమ్మం సహకారనగర్: జిల్లాలో స్కూల్ అసిస్టెంట్లకు హెచ్‌ఎంలుగా పదోన్నతి కల్పించే ప్రక్రియ కొనసాగుతోంది. ఈమేరకు బుధవారం నుంచి గురువారం ఉదయం వరకు 67మంది వెబ్ ఆప్షన్లు ఇచ్చారని అధికారులు తెలిపారు. దీంతో వీరికి గురువారం అర్ధరాత్రి వరకు గ్రేడ్–2 హెచ్‌ఎంలుగా పదోన్నతి ఉత్తర్వులు అందే అవకాశముంది. ఇక సెకండరీ గ్రేడ్ టీచర్ల(ఎస్‌జీటీ)కు స్కూల్ అసిస్టెంట్లు(ఎస్‌ఏ)లుగా పదోన్నతి ప్రక్రియ షెడ్యూల్ ప్రకారం కొనసాగించనున్నారు. ఇందులో భాగంగా శుక్రవారం సీనియారిటీ జాబితా, ఖాళీలు ప్రదర్శిస్తారు. ఆపై అభ్యంతరాలు స్వీకరించాక తుది జాబితాను ఈ నెల 23, 24వ తేదీల్లో విడుదల చేస్తారు. అనంతరం 25వ తేదీన వెబ్ ఆప్షన్లకు అవకాశం కల్పించి, 26వ తేదీన పదోన్నతి ఉత్తర్వులు జారీ చేయనున్నారు.

నిలకడగా గోదావరి

వారం తర్వాత మళ్లీ పెరిగే అవకాశం!

భద్రాచలంఅర్బన్ : భద్రాచలం వద్ద గోదావరి నీటి మట్టం గురువారం సాయంత్రం నుంచి నిలకడగా ఉంది. బుధవారం ఒక్కసారిగా పెరగడంతో ఒకేరోజు మొదటి, రెండో ప్రమాద హెచ్చరికలు జారీ అయిన విషయం తెలిసిందే. ఇక గురువారం తెల్లవారుజామున 5గంటలకు 50 అడుగులు, 7 గంటలకు 50.60 అడుగులు, 10 గంటలకు 51.10 అడుగులకు చేరుకుని, ఆ తర్వాత నెమ్మదిగా పెరుగుతూ సాయంత్రం 4గంటలకు 51.90 అడుగులుగా నమోదైంది. అప్పటి నుంచి రాత్రి 8గంటల వరకు అలాగే కొనసాగి.. ఆపై తగ్గడం మొదలైంది.

వీడిన భయాందోళనలు..

గోదావరి నీటిమట్టం బుధవారం భారీగా పెరగడంతో గురువారం కూడా ప్రభావం చూపుతుందని, మూడో ప్రమాద హెచ్చరిక జారీ అవుతుందని అందరూ భావించారు. తీరప్రాంత ప్రజలు భయాందోళనకు గురయ్యారు. కానీ సాయంత్రం నుంచి నీటిమట్టం నిలకడగా ఉండడంతో స్థానికులతో పాటు అధికారులు ఊపిరి పీల్చుకున్నారు. గురువారం అర్ధరాత్రి నుంచి శుక్రవారం ఉదయం వరకు వరద నెమ్మదిగా తగ్గుతుందని, 9గంటల తర్వాత వేగంగా తగ్గే అవకాశం ఉందని అధికారులు అంచనా వేస్తున్నారు. అయితే.. ప్రస్తుతం భద్రాచలం వద్ద గోదావరి వరద నీరు తగ్గినా మహారాష్ట్రలో ఇటీవల కురిసిన వర్షాలతో అక్కడి నుంచి వరద ప్రవాహం వారం రోజుల తర్వాత భద్రాచలం చేరుకుంటుందని, అప్పుడే మళ్లీ వరద పెరిగే ప్రమాదం ఉందని అంటున్నారు.



గోదావరి బ్రిడ్జిని ఆనుకుని ప్రవహిస్తున్న వరద (ఇన్‌సెట్) సాయంత్రం 5 గంటలకు 51.90 అడుగులకు వచ్చిన వరద

గ్రామాల్లో 'పనుల జాతర'

- నేడు ఊరూరా అభివృద్ధి పనులకు శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలు
- ఉపాధి నిధులతో పనులకు శ్రీకారం
- జీపీ, అంగన్‌వాడీ భవనాలపై దృష్టి

ఖమ్మంమయూరిసెంటర్: గ్రామీణ ప్రాంతాల సమగ్ర అభివృద్ధి.. నిరుపేద కూలీల కుటుంబాలకు జీవనోపాధి పెంచేలా రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించింది. శాఖల సమన్వయంతో జిల్లాలోని అన్ని గ్రామాల్లో ఒకేసారి అభివృద్ధి పనులకు శంకుస్థాపన, పూర్తయిన పనులను ప్రారంభించాలని నిర్ణయించింది. 'పనుల జాతర–2025' పేరుతో నిర్వహించే ఈ కార్యక్రమాన్ని శుక్రవారం పంచాయతీ రాజ్, గ్రామీణాభివృద్ధి శాఖల ఆధ్వర్యాన జిల్లాలోని 20 మండలాల పరిధి 571 గ్రామాల్లో నిర్వహించేందుకు ఏర్పాట్లు చేశారు.

'ఉపాధి హామీ'కి కొత్త రూపం

మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం(ఎంఎన్ఆర్ఈజీఎస్) పేదలకు పని కల్పనకే పరిమితం కాకుండా, గ్రామీణ సమాజానికి శాశ్వత ఆస్తులను సృష్టించేందుకు దోహదపడుతోంది. ఈమేరకు పనుల జాతర కార్యక్రమం ద్వారా వేలాది మందికి పని కల్పించడం సాధ్యమవుతుందని చెబుతున్నారు. ఇదే సమయాన వ్యక్తిగత, సామూహిక ఆస్తుల కల్పన పనులతో గ్రామీణ ఆర్థిక వ్యవస్థకు ఊపు తీసుకురానున్నారు.



తల్లాడ మండలం బాలపేటలో ముస్తాబైన గ్రామపంచాయతీ భవనం

ప్రారంభోత్సవాలే లక్ష్యంగా..

'పనుల జాతర'లో భాగంగా కీలకమైన నిర్మాణాలకు శుక్రవారం శంకుస్థాపన చేయనున్నారు. ఇందులో గ్రామపంచాయతీ, అంగన్‌వాడీ భవనాలు ఉన్నాయి. అలాగే, స్వచ్ఛభారత్ మిషన్(గ్రామీణ) ద్వారా నిర్మించిన సెగ్రిగేషన్ షెడ్లు, కమ్యూనిటీ శానిటరీ కాంప్లెక్స్‌లను ప్రారంభిస్తారు. అంతేకాక వర్షపు నీటిని సంరక్షించి, భూగర్భ జలాలను పెంపొందించేందుకు ఉద్దేశించిన 'జలనిధి' పథకం ద్వారా చేపట్టనున్న పనులకు కూడా భూమి పూజ చేస్తారు. ఇంకా 'ఇందిరా మహిళా శక్తి – ఉపాధి భరోసా' కింద చేపట్టే వ్యక్తిగత ఆస్తుల కల్పన పనులకు సైతం భూమి పూజ నిర్వహించనున్నారు. ఇందులో ప్రధానంగా పశువుల కొట్టాలు, కోళ్లు, గొర్రెల షెడ్లు, వానపాములతో ఎరువుల తయారీ కేంద్రాలు, అజోలా పిట్ నిర్మాణాలు ఉన్నాయి. ఈ పనులు మహిళల ఆదాయాన్ని పెంచి, వారి ఆర్థికాభివృద్ధికి బాటలు వేస్తాయని చెబుతున్నారు.

నిస్వార్థ సేవకులకు సత్కారం

సామూహికంగా చేపట్టే ఈ కార్యక్రమం అభివృద్ధి పనులకే పరిమితం కాకుండా, గ్రామాభివృద్ధిలో కీలక పాత్ర పోషిస్తున్న వ్యక్తులను గౌరవించేందుకు కూడా వేదికగా నిలవనుంది. ఎక్కువ రోజులు పని చేసిన ఉపాధి కూలీలు, దివ్యాంగులు, పారిశుద్ధ్య కార్మికులు, హరిత సంరక్షకులను అధికారులు సన్మానించనున్నారు. ఈ కార్యక్రమాల్లో నియోజకవర్గాల ప్రజాప్రతినిధులు పాల్గొనేలా షెడ్యూల్ రూపొందించారు.

సమన్వయమే కీలకం

పనుల జాతరను విజయవంతం చేసేందుకు జిల్లా అధికార యంత్రాంగం సిద్ధమైంది. ఇప్పటికే కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి అన్ని విభాగాల అధికారులతో సమీక్ష నిర్వహించారు. పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి విభాగాలైన ఉపాధి హామీ, స్వచ్ఛభారత్, ఆర్‌డబ్ల్యూఎస్, పంచాయతీ రాజ్–ఇంజినీరింగ్, వాటర్ షెడ్ వంటి అన్ని విభాగాల అధికారులు పూర్తి సమన్వయంతో పనిచేస్తూ విజయవంతం చేయాలని ఆదేశించారు.

రెండు కళ్లలా సంక్షేమం, అభివృద్ధి

- 'భూభారతి'తో భూసమస్యల శాశ్వత పరిష్కారం
- ప్రజాప్రభుత్వానికి అంతా అండగా నిలవాలి
- రాష్ట్ర మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి

తిరుమలాయపాలెం/నేలకొండపల్లి: పేదల సంక్షేమం, అభివృద్ధిని తమ ప్రభుత్వం రెండు కళ్లలా భావిస్తోందని రాష్ట్ర రెవెన్యూ, హౌసింగ్, సమాచార పౌరసంబంధాల శాఖల మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి తెలిపారు. ఈనేపథ్యాన అన్ని వర్గాల ప్రజలు తమకు అండగా నిలవాలని ఆయన కోరారు. తిరుమలాయపాలెం మండలంలోని సుబ్లేడు, పిండిప్రోలు, నేలకొండపల్లి మండలం గువ్వలగూడెంలో రహదారుల నిర్మాణానికి గురువారం శంకుస్థాపన చేసిన మంత్రి నేలకొండపల్లిలో పశు ఆస్పత్రి భవన నిర్మాణ పనులకు శంకుస్థాపన చేశారు. ఆయా సమావేశాల్లో మంత్రి పొంగులేటి మాట్లాడుతూ రాష్ట్రంలోని ప్రతీ మారుమూల గ్రామంలో సీఎం రేవంత్‌రెడ్డి నేతృత్వాన అభివృద్ధి పనులు చేపడుతున్నామని తెలిపారు. గత ప్రభుత్వం అమలుచేసిన మంచి కార్యక్రమాలను బేషజాలకు పోకుండా కొనసాగిస్తూనే.. అదనంగా మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం అమలుచేస్తూ ఉచిత విద్యుత్, రూ.500కే గ్యాస్ సిలిండర్ పంపిణీ చేస్తున్నామని చెప్పారు. అలాగే, రైతులకు పెట్టుబడి సాయం పెంచామని, రుణమాఫీ చేయడమే కాక అర్హులకు రేషన్‌కార్డులు, ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేస్తున్నామని మంత్రి తెలిపారు. అర్హులైన ప్రతీఒక్కరికి ఇల్లు మంజూరు చేసే బాధ్యత తాను తీసుకుంటానని మంత్రి చెప్పారు. కాగా, భూభారతి చట్టాన్ని ప్రవేశపెట్టి భూ సమస్యలకు శాశ్వత పరిష్కారం చూపిస్తున్నట్లు వెల్లడించారు.

పాఠశాలల్లో వసతుల కల్పనకు రూ.497 కోట్లు

పాలేరు నియోజకవర్గంలోని విద్యాసంస్థల్లో మౌలిక సదుపాయాల కల్పన, అభివృద్ధికి రూ.497 కోట్లు వెచ్చిస్తున్నామని మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి తెలిపారు. తిరుమలాయపాలెం మండలంలోని పిండిప్రోలు, నేలకొండపల్లి మండలంలోని బోదులబండ జెడ్పీహెచ్ఎస్ విద్యార్థినులకు పీఎస్ఆర్ ట్రస్ట్ ఆధ్వర్యాన కలెక్టర్ అనుదీప్ దురిశెట్టితో కలిసి సైకిళ్లు పంపిణీ చేశాక మంత్రి మాట్లాడారు. గడిచిన 19 నెలల కాలంలో నియోజకవర్గంలో రూ.497 కోట్ల నిధులతో పాఠశాలల్లో వసతులు కల్పించామని తెలిపారు. అలాగే, జేఎన్టీయూ ఇంజనీరింగ్ కళాశాల, యంగ్ ఇండియా సమీకృత గురుకులాల నిర్మాణం, తిరుమలాయపాలెంలో ఐటీఐ, కూసుమంచిలో జూనియర్ కళాశాల మంజూరు చేశామని చెప్పారు. కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి మాట్లాడుతూ విద్యార్థినులు పాఠశాలలకు రావడానికి ఇబ్బంది పడకుండా పీఎస్ఆర్ ట్రస్టు ద్వారా మంత్రి సైకిళ్లు పంపిణీ చేస్తున్నందున సద్వినియోగం చేసుకొని ఉన్నత స్థాయికి ఎదగాలని సూచించారు. కాగా, పిండిప్రోలు జెడ్పీహెచ్ఎస్‌లో కిచెన్ షెడ్, మధ్యాహ్న భోజన నాణ్యతను తనిఖీ చేసిన మంత్రి, నేలకొండపల్లి మండలానికి చెందిన 25 మంది కల్యాణలక్ష్మి లబ్ధిదారులకు చెక్కులు అందజేశారు. ఈ కార్యక్రమాల్లో డీఈఓ నాగపద్మజ, ఆర్ అండ్ బీ, పీఆర్ ఎస్‌ఈలు యాకోబ్, వెంకట్‌రెడ్డి, జీసీడీఓ తులసి, ఆర్‌డీఓ నర్సింహారావు, పాలేరు నియోజకవర్గ ప్రత్యేక అధికారి రమేష్, తహసీల్దార్లు విల్సన్, వెంకటేశ్వర్లు, ఎంపీడీఓలు సిలార్‌సాహెబ్, ఎర్రయ్య, పీఏసీఎస్, ఆత్మ, మార్కెట్ చైర్మన్లు నరేష్‌రెడ్డి, చావా శివరామకృష్ణ, వెన్నపూసల సీతారాములు, ఎంఈఓ శ్రీనివాసరావు, హెచ్‌ఎంలు జ్యోతి, నిర్మలతో పాటు బెల్లం శ్రీనివాస్, మంగీలాల్, అశోక్, బొర్రా రాజశేఖర్ తదితరులు పాల్గొన్నారు.



పిండిప్రోలు పాఠశాలలో భోజనాన్ని పరిశీలించి విద్యార్థులతో మాట్లాడుతున్న మంత్రి పొంగులేటి, పక్కన కలెక్టర్ అనుదీప్



కల్యాణలక్ష్మి చెక్కులు అందజేస్తున్న మంత్రి

స్థానిక సమరానికి సిద్ధం కండి

కూసుమంచి: త్వరలో స్థానిక సంస్థల ఎన్నికలు జరుగనున్నందున పార్టీ నాయకులు, కార్యకర్తలు సిద్ధం కావాలని మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి సూచించారు. కూసుమంచిలోని క్యాంపు కార్యాలయంలో మండల నాయకులు, కార్యకర్తలు, ప్రజాప్రతినిధులతో సమావేశమైన ఆయన దిశానిర్దేశం చేశారు. రాష్ట్ర ప్రభుత్వం అమలుచేస్తున్న అభివృద్ధి, సంక్షేమ పథకాలను ప్రజలకు వివరించి స్థానిక ఎన్నికల్లో వారి మద్దతు పొందాలని తెలిపారు. గ్రామాల్లో మంచి వ్యక్తిని అంతా కలిసి ఎంపిక చేసి బరిలోకి దింపితే విజయం సొంతమవుతుందని చెప్పారు. ఇదే సమయాన పార్టీలో కష్టపడిన వారికి గుర్తింపు లభిస్తుందని, ఎన్నికల్లో పార్టీ అభ్యర్థుల విజయమే లక్ష్యంగా పనిచేయాలని మంత్రి సూచించారు.

చిన్నారుల ఎదుగుదలపై పర్యవేక్షణ

- అంగన్‌వాడీల్లో వంద శాతం ఎఫ్ఆర్ఎస్ ద్వారానే హాజరు
- అదనపు కలెక్టర్ శ్రీజ



పెద్దాస్పత్రిలో మాట్లాడుతున్న అదనపు కలెక్టర్ శ్రీజ

ఖమ్మంమయూరిసెంటర్: అంగన్‌వాడీ కేంద్రాల్లో పిల్లల ఎదుగుదలను నిరంతరం పర్యవేక్షించాలని అదనపు కలెక్టర్ డాక్టర్ పి.శ్రీజ సూచించారు. కలెక్టరేట్‌లో గురువారం మహిళా, శిశు, దివ్యాంగుల సంక్షేమ శాఖపై సమీక్షించారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో న్యూట్రిషన్ రిహాబిలిటేషన్ సెంటర్ ఏర్పాటు చేసినందున పిల్లలు పోషకాహార లోపంతో బాధపడుతుంటే పౌష్టికాహారం సమకూర్చాలని తెలిపారు. ఈ విషయంలో నిర్లక్ష్యం చేసే ఉద్యోగులు జిల్లాలో పనిచేయాల్సిన అవసరం లేదని తేల్చిచెప్పారు. అలాగే, అంగన్‌వాడీ కేంద్రాల్లో హాజరు ఎఫ్ఆర్ఎస్ ద్వారానే నమోదు చేయాలని తెలిపారు. కేంద్రాల్లో అవసరమైన మరమ్మతులు చేయించాలని సూచించారు. జిల్లా సంక్షేమ అధికారి కె.రాంగోపాల్‌రెడ్డి, సీడీపీఓలు, సూపర్‌వైజర్లు పాల్గొన్నారు.

పెద్దాస్పత్రి నిర్వహణపై ఆగ్రహం

ఖమ్మంవైద్యవిభాగం: ప్రభుత్వ జనరల్ ఆస్పత్రిని అదనపు కలెక్టర్ శ్రీజ తనిఖీ చేశారు. ఈ సందర్భంగా మరుగుదొడ్ల మరమ్మతులకు నిధులు కేటాయించినా పనులు చేయకపోవడంపై టీఎస్ఎంఎస్ఐడీసీ అధికారులపై ఆగ్రహం వ్యక్తం చేశారు. అలాగే, పలు విభాగాల్లో అపరిశుభ్రంగా ఉండడాన్ని గుర్తించిన ఆమె సిబ్బందిని మందలించారు. మెడికల్ సూపరింటెండెంట్ ఎం.నరేందర్, ఆర్ఎంఓ బి.రాంబాబు పాల్గొన్నారు.

విద్యార్థుల హాజరు పెరగాలి



క్రీడాసామగ్రిని పరిశీలిస్తున్న డీఐఈఓ రవిబాబు

తిరుమలాయపాలెం: ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ప్రవేశాలు పొందిన విద్యార్థులు క్రమం తప్పకుండా హాజరయ్యే అధ్యాపకులు పర్యవేక్షించాలని జిల్లా ఇంటర్మీడియట్ విద్యాశాఖాధికారి రవిబాబు సూచించారు. తిరుమలాయపాలెం మండలం పిండిప్రోలు కళాశాలను గురువారం తనిఖీ చేసిన ఆయన బోధన, హాజరు పెంపుపై అధ్యాపకులకు సూచనలు చేశారు. అనంతరం కళాశాలకు కేటాయించిన క్రీడా సామగ్రిని పరిశీలించిన డీఐఈఓ మరమ్మతుల వివరాలు ఆరా తీశారు. ప్రిన్సిపాల్ శ్రీనివాసరావు, అధ్యాపకులు పాల్గొన్నారు.

ప్రజాస్వామ్యాన్ని ఖూనీ చేసేలా బిల్లు

సీపీఎం కేంద్ర కమిటీ సభ్యుడు తమ్మినేని

ఖమ్మంఅర్బన్: ప్రతిపక్షాలను అణచివేయడమే లక్ష్యంగా కేంద్రప్రభుత్వం పార్లమెంట్‌లో 30 రోజుల కస్టడీ బిల్లును ప్రవేశపెట్టిందని సీపీఎం కేంద్ర కమిటీ సభ్యుడు తమ్మినేని వీరభద్రం మండిపడ్డారు. అవినీతి నిర్మూలన పేరుతో తీసుకొచ్చిన ఈ బిల్లు బీజేపీకి గిట్టని పార్టీల ప్రభుత్వాలను అస్థిరం చేయడానికి పన్నిన కుట్రలో భాగమేనని.. తద్వారా ప్రజాస్వామ్యాన్ని ఖూనీ చేయనున్నారని పేర్కొన్నారు. ఖమ్మం టేకులపల్లిలో గురువారం నిర్వహించిన సీపీఎం నాయకుడు దొంగల కోటయ్య సంస్మరణ సభలో ఆయన మాట్లాడారు. ముప్పై రోజుల పాటు ఎమ్మెల్యేలు, ఎంపీలు, ముఖ్యమంత్రులు, ప్రధాని సైతం కస్టడీలో ఉంటే పదవులకు అనర్హులవుతారని బిల్లు పెట్టడం కేంద్ర ప్రభుత్వ ధోరణికి నిదర్శనమని తెలిపారు. ప్రజాసమస్యలపై పోరాడే నేతలను జైలులో పెడితే ఈ చట్టం ద్వారా పదవులు కోల్పోయే అవకాశముందని చెప్పారు. వ్యవసాయ కార్మిక సంఘం జాతీయ కార్యదర్శి బి.వెంకట్ మాట్లాడుతూ ప్రజా ఉద్యమాలను అణచివేయడానికే మోదీ ప్రభుత్వం ప్రయత్నిస్తోందని విమర్శించారు. సీపీఎం కేంద్ర కమిటీ సభ్యుడు ఎం.సాయిబాబు, రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు పోతినేని సుదర్శనరావు, జిల్లా కార్యదర్శి నున్నా నాగేశ్వరరావు, సీఐటీయూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పాలడుగు భాస్కర్‌తో పాటు నాయకులు వై.విక్రమ్, నాగరాజు, బుగ్గవీటి సరళ, బండి రమేష్, కళ్యాణం వెంకటేశ్వరరావు, మచ్చా వెంకటేశ్వర్లు, రాజారావు, పొన్నం వెంకటేశ్వరరావు, మాదినేని రమేష్, బొంతు రాంబాబు, యర్రా శ్రీనివాసరావు, బండి పద్మ, దొంగల తిరుపతిరావు తదితరులు పాల్గొన్నారు.



కోటయ్య చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న వీరభద్రం, నాయకులు

లోకం చూడని బిడ్డలు

ఆడశిశువుగా తేలితే కడుపులోనే చిదిమేస్తున్న వైనం

- జిల్లాలో తగ్గుతున్న బాలికల సంఖ్య
- గత ఏడాది కంటే మరింత తగ్గడంపై ఆందోళన

ఖమ్మంవైద్యవిభాగం: జిల్లాలో భ్రూణహత్యలు యథేచ్ఛగా కొనసాగుతున్నాయనే ఆరోపణలు వస్తున్నాయి. కడుపులో పెరుగుతున్నది ఆడబిడ్డ అని తెలిస్తే చాలు పొట్టలోనే చిదిమేస్తున్నారు. లింగ నిర్ధారణ పరీక్షలు, ఫలితాల వెల్లడి చట్టప్రకారం నేరమని తెలిసినా కొందరు అదేమీ పట్టించుకోవడం లేదు. జిల్లా కేంద్రంతో పాటు మండలాల్లోని ప్రైవేట్ ఆస్పత్రులు, నర్సింగ్‌హోమ్‌ల్లో లింగ నిర్ధారణ పరీక్షలు అడ్డగోలుగా నిర్వహిస్తున్నారు. ఆపై భ్రూణహత్యలకు పాల్పడుతుండడంతో జిల్లాలో అబ్బాయిలు, అమ్మాయిల నిష్పత్తిలో తేడా కనిపిస్తోంది.

అప్పుడు 926.. ఇప్పుడు 864

గతంతో పోలిస్తే జిల్లాలో ఈ ఏడాది స్త్రీ, పురుష నిష్పత్తిలో తేడా నమోదైంది. ప్రతీ వేయి మంది మగ వారికి కేవలం 864 మందే ఆడవారు ఉన్నట్లు వైద్య, ఆరోగ్య శాఖ లెక్కలు చెబుతున్నాయి. గత ఏడాది ఈ సంఖ్య 926గా ఉండగా.. ఇప్పుడు మరింత తగ్గడం యథేచ్ఛగా భ్రూణహత్యలు జరుగుతున్నాయనడానికి నిదర్శనంగా నిలుస్తోంది.

అధికారుల పర్యవేక్షణ ఎక్కడ?

సులువుగా లింగ నిర్ధారణ పరీక్షలు చేయించే అవకాశం ఏర్పడడానికి వైద్య, ఆరోగ్య శాఖ అధికారుల పర్యవేక్షణ లోపించడమే కారణమని తెలుస్తోంది. గర్భస్థ శిశు లింగ నిర్ధారణను బహిర్గతం చేయడం, పిండ దశలోనే హత్య చేయటం చట్టప్రకారం నేరం. దీన్ని విస్మరించే వారికి జైలు శిక్ష, జరిమానా విధించేలా చట్టం ఉన్నా అమలు కావడం లేదు. జిల్లాలో నిబంధనలకు విరుద్ధంగా కొందరు స్కానింగ్ సెంటర్ల నిర్వాహకులు లింగ నిర్ధారణ పరీక్షలు చేస్తున్నారని సమాచారం. కొందరు ఆర్ఎంపీలు ముఠాలుగా ఏర్పడి గర్భిణులను స్కానింగ్ సెంటర్లకు తీసుకొచ్చి పరీక్ష చేయించడమే కాక అవసరమైతే అబార్షన్ చేయించేలా ఒప్పందం కుదుర్చుకుంటున్నారని సమాచారం. ఇటీవల ఓ ముఠా సభ్యులు వాహనంలోనే యంత్రాల సాయంతో లింగ నిర్ధారణ పరీక్షలు చేసినట్లు బయటపడినా కఠిన చర్యలేవీ తీసుకోకపోవడంతో అలాంటి వారి ఆగడాలు ఆగడం లేదు.



తనిఖీలు లోపించడంతో..

జిల్లాలో గత ఏడాది ఆరంభంలో లింగ నిర్ధారణ, అబార్షన్లు చేస్తున్న సెంటర్లపై వైద్య, ఆరోగ్య శాఖ దాడులు నిర్వహించారు. ఇందులో భాగంగా కొన్ని ఆస్పత్రులను సీజ్ చేసినా ఆతర్వాత పట్టించుకోకపోవడంతో పరిస్థితి యథాస్థితికి చేరింది. సీజ్ చేసిన ఆస్పత్రులు వేరే పేర్లతో రిజిస్ట్రేషన్ చేయించి తిరిగి దందా కొనసాగిస్తున్నట్లు ఆరోపణలున్నాయి. ఇక ఆ తర్వాత ఎక్కడా తనిఖీ చేసిన దాఖలు లేకపోగా.. ఫిర్యాదు వస్తే తనిఖీలు చేస్తామని అధికారులు చెబుతుండడం విమర్శలకు తావిస్తోంది. గర్భిణులకు ప్రత్యేక పరిస్థితుల్లో మాత్రమే లింగ నిర్ధారణ పరీక్ష చేయించేందుకు అనుమతి ఉంటుంది. కడుపులో పెరుగుతున్న పిండం జన్యు సంబంధమైన వ్యాధులతో బాధపడుతున్నట్లు అనుమానం ఉంటే పరీక్ష చేయిస్తారు. రెండు సార్లు అంత కంటే ఎక్కువ సార్లు గర్భస్రావం జరిగినప్పుడు, గర్భిణి, ఆమె భర్త కుటుంబీకుల్లో ఎవరికైనా బుద్ధి మాంద్యం, శారీక వైకల్యం, జన్యు సంబంధిత వ్యాధులతో బాధపడుతున్నా పిండానికి పరీక్షకు అనుమతి ఉంటుంది. కానీ వైద్య, ఆరోగ్యశాఖ నిర్లిప్తతతో కొన్ని స్కానింగ్ సెంటర్లలో లింగ నిర్ధారణ పరీక్షలు.. ఆపై భ్రూణహత్యలు యథేచ్ఛగా కొనసాగిస్తున్నట్లు ప్రచారం జరుగుతోంది. ఇప్పటికైనా వైద్య ఆరోగ్య, పోలీస్, రెవెన్యూ తదితర శాఖలు సమన్వయంతో ఈ పరీక్షలను కట్టడి చేయకపోతే జిల్లాలో ఆడపిల్లల నిష్పత్తి మరింత దిగజారే ప్రమాదముంది.

బియ్యంతో పాటు సంచులు..

ఉమ్మడి జిల్లాలో పంపిణీకి బ్యాగులు

పాల్వంచరూరల్ : బియ్యం కోసం రేషన్ షాపులకు వెళ్లేవారు ఇకపై బస్తాలు, సంచులు తీసుకెళ్లాల్సిన పని లేదు. వచ్చే నెల నుంచి ప్రభుత్వమే ఉచితంగా సంచులు సరఫరా చేయనుంది. ఈ మేరకు సంచిపై 'అందరికీ సన్నబియ్యం.. ప్రజా ప్రభుత్వంతోనే సాధ్యం' అని రాయించడమే కాక సీఎం రేవంత్‌రెడ్డి, డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క, పౌర సరఫరాల శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి ఫొటోలను ముద్రించారు. గతంలోనూ కాంగ్రెస్ అధికారంలో ఉన్నప్పుడు ఇలాంటి సంచులు పంపిణీ చేసిన విషయం తెలిసిందే. ప్రస్తుత ప్రభుత్వం అందించే సంచి విలువ రూ.50 వరకు ఉంటుందని తెలుస్తుండగా.. పంపిణీకి అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు.



సీఎం, మంత్రుల ఫొటోలతో కూడిన సంచి

క్లుప్తంగా

రేపు జాబ్ మేళా

ఖమ్మం రాపర్తినగర్: నిరుద్యోగ యువతకు ఉపాధి అవకాశాలు కల్పించేందుకు శనివారం ఖమ్మం టేకులపల్లిలోని మోడల్ కెరీర్ సెంటర్‌లో జాబ్ మేళా నిర్వహిస్తున్నట్లు జిల్లా ఉపాధి కల్పన శాఖ అధికారి ఎస్.మాధవి తెలిపారు. రిలయన్స్ నిప్పాన్ లైఫ్ ఇన్సూరెన్స్, భారత్ హ్యూండాయ్‌లో ఉద్యోగాలకు ఇంటర్వ్యూలు నిర్వహిస్తారని వెల్లడించారు. ఆసక్తి ఉన్న యువతీ, యువకులు విద్యార్హతలు, ఇతర సర్టిఫికెట్ల జిరాక్స్ కాపీలతో హాజరుకావాలని సూచించారు.

సీపీఎస్ ఈయూ ఆధ్వర్యాన నేడు బ్లాక్ డే

ఖమ్మం సహకారనగర్: సీపీఎస్ ఉద్యోగ, ఉపాధ్యాయ సమస్యలను పరిష్కరించాలనే డిమాండ్‌తో శుక్రవారం బ్లాక్ డే నిర్వహించాలని నిర్ణయించినట్లు టీఎస్ సీపీఎస్ ఈయూ జిల్లా అధ్యక్షుడు చంద్రకంటి శేఖర్ ఓ ప్రకటనలో తెలిపారు. ఈమేరకు సీపీఎస్ ఉద్యోగులు పని ప్రదేశాల్లో భోజన విరామ సమయాన నల్లబ్యాడ్జీలు ధరించి నిరసన తెలపాలని కోరారు. కాగా, తమ సమస్యలను సీఎం రేవంత్‌రెడ్డి పరిష్కరిస్తారనే నమ్మకం ఉందని ఆయన ఆశాభావం వ్యక్తం చేశారు.

ఖమ్మం ర్యాలీపై కేంద్ర హోంశాఖ విచారణ

ఖమ్మం మయూరిసెంటర్(ఖమ్మంమామిళ్లగూడెం): పాలస్తీనాపై ఇజ్రాయిల్ దాడులను నిరసిస్తూ ఈనెల 5న ఖమ్మంలో నిర్వహించిన ర్యాలీపై కేంద్ర హోంశాఖ విచారణకు ఆదేశించిందని బీజేపీ జిల్లా మాజీ అధ్యక్షుడు గల్లా సత్యనారాయణ ఓ ప్రకటనలో తెలిపారు. పాలస్తీనాకు అనుకూలంగా నిర్వహించిన ర్యాలీకి అనుమతి లేకుండా మైనర్లను పిలిపించడమే కాక, ప్రభుత్వ విధానాలకు వ్యతిరేకంగా వారితో నినాదాలు చేయించారని పేర్కొన్నారు. ఈ మేరకు తాను కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్‌కు ఫిర్యాదు చేయగా కేంద్ర హోంశాఖ విచారణకు ఆదేశించిందని తెలిపారు.

మెప్మా పీడీగా నళినీ పద్మావతి


నళినీ పద్మావతి

ఖమ్మంమయూరిసెంటర్: జిల్లా మెప్మా ప్రాజెక్ట్ డైరెక్టర్‌గా జి.నళినీ పద్మావతి బాధ్యతలు స్వీకరించారు. పీడీగా నియమితులైన ఆమె ఖమ్మం నగర పాలక సంస్థ కార్యాలయంలోని మెప్మా కార్యాలయంలో గురువారం రిపోర్ట్ చేశారు. ఈ సందర్భంగా మెప్మా డీఎంసీ ఎస్.సుజాత, ఏడీఎంసీ, టీఎంసీ జి.సుజాత తదితరులు పీడీని మర్యాదపూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం జిల్లాలో మెప్మా కార్యకలాపాలపై నళిని సమీక్షించారు.

అథ్లెటిక్స్ ఎంపిక పోటీలకు 200మంది..


పోటీలో పాల్గొన్న క్రీడాకారులు

ఖమ్మం స్పోర్ట్స్: జిల్లాస్థాయి అథ్లెటిక్స్ జట్ల ఎంపిక పోటీలకు భారీ స్పందన లభించింది. జిల్లా అథ్లెటిక్స్ అసోసియేషన్ ఆధ్వర్యాన గురువారం ఖమ్మంలోని ఎస్ఆర్అండ్‌బీజీఎన్ఆర్ కళాశాల మైదానంలో పోటీలు నిర్వహించారు. ఈమేరకు 124 మంది బాలురు, 76 మంది బాలికలు హాజరుకాగా, ప్రతిభ కనబరిచిన వారిని జిల్లా జట్టుకు ఎంపిక చేసినట్లు అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు మందుల వెంకటేశ్వర్లు, ఎం.డీ.షఫీక్ అహ్మద్ తెలిపారు. ఈ జట్లు మహబూబ్‌నగర్‌లో జరిగే రాష్ట్ర స్థాయి పోటీల్లో పాల్గొంటాయని వెల్లడించారు. ఖమ్మం అథ్లెటిక్స్ అకాడమీ చీఫ్ కోచ్ ఎం.డి.గౌస్, అసోసియేషన్ బాధ్యులు సుధాకర్, రవి, వెంకటేశ్వర్లు, నవీద్, తిరుపతి పాల్గొన్నారు.

'బొమ్మ' కాలేజీకి పేటెంట్


పేటెంట్ పత్రాలతో చైర్మన్, వైస్‌చైర్మన్ తదితరులు

ఖమ్మంఅర్బన్: ఖమ్మంలోని బొమ్మ ఇన్‌స్టిట్యూషన్ ఆఫ్ ఫార్మసీ కళాశాలకు మరో పేటెంట్ లభించింది. గతంలో ఓ పేటెంట్ ఉండగా, ప్రస్తుతం కేంద్రప్రభుత్వం పరిధిలోని 'ఇంటిలెక్చువల్ ప్రాపర్టీ రైట్స్ విభాగం'నుంచి 'ఆటోమేటెడ్ న్యూరల్ నెట్‌వర్క్ బేస్డ్(ఏడీఎంఈ) ప్రెడిక్షన్ షన్ సిస్టమ్ ఎక్విప్‌మెంట్'కు రెండో పేటెంట్ మంజూరు చేశారు. ఈ సందర్భంగా గురువారం బొమ్మ కాలేజీ చైర్మన్ రాజేశ్వరరావు మాట్లాడుతూ రాష్ట్రంలోనే రెండు పేటెంట్లు దక్కించుకున్న ఏకైక కాలేజీ తమది కావడం గర్వంగా ఉందని తెలిపారు. అనంతరం వైస్ చైర్మన్ బొమ్మ సత్యప్రసాద్, సెక్రటరీ ఉదార్ శ్రీధర్, ప్రిన్సిపాల్ డాక్టర్ విజయ్‌భాస్కర్‌కు మాట్లాడగా అధ్యాపకులు డాక్టర్ కిరణ్ జ్యోతి, సంతోష్, సుచరిత, అక్షిత, విశ్వర్య, జ్ఞానేశ్వరరెడ్డి, యణవి, శ్రావణిరెడ్డి, నవీన్, రక్షిత, సాంధిక పాల్గొన్నారు.

పామాయిల్ గెలలు



టన్ను ధర	రూ.18,052

కొరత పేరుతో దందా


ఓ వ్యాపారి గోదాంలో నిల్వ చేసిన ఎరువులు

- యూరియాకు ఎరువులు, పురుగుమందులతో లింకు
- అన్నదాతలను దగా చేస్తున్న వ్యాపారులు
- అక్రమార్కులకు వ్యవసాయ శాఖ నోటీసులు

ఖమ్మంవ్యవసాయం: జిల్లాలో కొందరు ఎరువుల వ్యాపారుల దందాకు అడ్డూఅదుపు లేకుండా పోయింది. యూరియా కొరతను సాకుగా చూపుతూ రైతులను మోసం చేయడమే లక్ష్యంగా ఎత్తులు వేస్తున్నారు. మునుపెన్నడూ లేని విధంగా ఈసారి యూరియా కొరత ఏర్పడడంతో.. పీఏసీఎస్‌ల్లో ఒక్కో రైతుకు ఒకటి, రెండు బస్తాలే ఇస్తున్నారు. దీంతో రైతులు వ్యాపారులను ఆశ్రయిస్తుండగా యూరియా ఇవ్వాలంటే ఇతర ఎరువులు, పురుగు మందులు అంటగడుతున్నారు. ఇంకొందరు బినామీల ఇళ్లలో యూరియా నిల్వ చేసి అధిక ధరలకు విక్రయిస్తున్నారు. ఈనేపథ్యాన తాజాగా టాస్క్‌ఫోర్స్ బృందాలు చేపట్టిన తనిఖీల్లో జిల్లాలోని ఐదు ఎరువుల దుకాణాల్లో అక్రమాలు వెలుగుచూశాయి. దీంతో ఆయా షాపుల నిర్వాహకులకు వ్యవసాయ శాఖ నోటీసులు జారీ చేసింది.

అధిక ధర.. ఆపై ఇతర మందులు

యూరియా బస్తా ఎమ్మార్పీ రూ.266 కాగా రూ.310గా పలువురు వ్యాపారులు అమ్ముతున్నారు. ఇదికాక రూ.500 నుంచి రూ.600 ధర ఉన్న బయో ఫెర్టిలైజర్ బస్తాను రూ.900కు అంటగడుతున్నారు. ఇంకొందరు పురుగు మందులను బలవంతంగా కొనసాగాలని చెబుతున్నారు. ఇదేమిటని ప్రశ్నిస్తే నెపాన్ని కంపెనీలపైకి నెడుతుండడం గమనార్హం. అయినా యూరియా కొరతతో రైతులు చేసేదేం లేక వ్యాపారులు చెప్పినట్లు కొనుగోలు చేస్తున్నారు.

అక్కడకు వెళ్లండి...

వ్యాపారులకు సరఫరా అయ్యే యూరియాను బినామీల ఇళ్లలో నిల్వ చేస్తున్నారు. రైతులెవరైనా షాప్‌నకు యూరియా కోసం వెళ్తే తమ వద్ద లేదంటూ బినామీల వద్దకు పంపిస్తున్నారని సమాచారం. అక్కడకు వెళ్తే యూరియా బస్తాను రూ.400కు అమ్ముతుండడం గమనార్హం. ఇక సహకార సంఘాల్లో సంఘాల పాలకవర్గాలు, రాజకీయ పార్టీల నాయకులు సిఫారసు చేసిన వారికి అడిగినంత యూరియా ఇస్తున్నారని సమాచారం. మిగిలిన వారికి ఒకటి, రెండు బస్తాలే ఇస్తుండడంతో రైతులు పడిగాపులు కాయాల్సి వస్తోంది.

వెలుగుచూసిన అక్రమాలు

యూరియా కొరతతో అన్నదాతలు ఇబ్బంది పడుతుండగా వ్యాపారులు దందాకు పాల్పడుతున్నట్లు పోలీస్ యంత్రాంగానికి సమాచారం అందింది. దీంతో పోలీస్ కమిషనర్ ఆదేశాలతో టాస్క్‌ఫోర్స్ బృందాలు వివిధ షాపుల్లో తనిఖీ చేపట్టారు. ఈ సందర్భంగా ధర పెంచడం, ఇతర ఎరువులు అంటగడుతున్న విషయం నిజమేనని తేలింది. దీంతో ఐదు ఎరువుల షాపుల్లో అక్రమాలపై వ్యవసాయ శాఖకు నివేదించగా..వారికి షోకాజు నోటీసులు జారీ చేశారు. అయితే, వ్యాపారులు మాత్రం కంపెనీలు ఇస్తుండడంతో అమ్ముతున్నామే తప్ప తమ తప్పేమి లేదని తప్పించుకునే ప్రయత్నం చేసినట్లు సమాచారం. కాగా, సీజన్ ఆరంభం నుంచి ఎరువుల దందా కొనసాగుతున్నా వ్యవసాయ శాఖ ఒక్క కేసు నమోదు చేయకపోవడం.. పోలీసులు తనిఖీ చేసే వరకు మేల్కొనడంపై విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. నేలకొండపల్లిలోని లక్ష్మీప్రసన్న ఫెర్టిలైజర్స్, రఘునాథపాలెం మండలం మంచుకొండలోని న్యూకుమార్ ఫెర్టిలైజర్స్, చింతకాని మండలం నాగులవంచలోని అన్నదాత ఎంటర్‌ప్రైజెస్, సత్తుపల్లిలోని పార్థసారధి ట్రేడర్స్, గంగారంలోని వెంకటేశ్వర ఫెర్టిలైజర్స్‌కు షోకాజు నోటీసులు జారీ అయ్యాయి.

చట్టపరమైన చర్యలు తప్పవు..



ఇతర ఎరువులతో లింక్ చేసి యూరియా విక్రయించటం చట్టవిరుద్ధం. ఈ విషయంలో రైతులు ఫిర్యాదు చేస్తే చట్టపరమైన చర్యలు తీసుకుంటాం. టాస్క్‌ఫోర్స్ బృందాల దాడిలో అక్రమాలకు పాల్పడినట్లు తేలిన ఐదు షాపుల నిర్వాహకులకు నోటీసులు ఇచ్చాం. దీనికి వివరణ అందాక చర్యలు తీసుకుంటాం.

– ధనసరి పుల్లయ్య, జిల్లా వ్యవసాయాధికారి

'సీతారామ' పూర్తికాకుండా నీళ్లు ఎలా వస్తాయి?

సీపీఎం రాష్ట్ర కమిటీ సభ్యుడు సుదర్శన్‌రావు


మాట్లాడుతున్న పోతినేని సుదర్శన్‌రావు

ఎర్రుపాలెం: సీతారామ ఎత్తిపోతల పథకాన్ని పూర్తి చేయకుండా వైరా నదికి జలాలు ఎలా వస్తాయి, అక్కడి నుంచి జవహర్ ఎత్తిపోతలతో మధిర, ఎర్రుపాలెం మండలాలకు ఎలా సరఫరా చేస్తారో డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క చెప్పాలని సీపీఎం రాష్ట్ర కమిటీ సభ్యులు పోతినేని సుదర్శన్‌రావు సూచించారు. ఎర్రుపాలెం మండలం మీనవోలు, భీమవరంల్లో నిర్వహించిన ముఖ్య కార్యకర్తల సమావేశాల్లో ఆయన మాట్లాడారు. అధికారంలోకి వస్తే ఆరు గ్యారంటీలు అమలు చేస్తామని చెప్పి కరపత్రాల్లో సంతకం పెట్టిన డిప్యూటీ సీఎం అమలులో చిత్తశుద్ధి చూపడం లేదని ఆరోపించారు. మహిళలకు రూ.2,500, ఇందిరమ్మ భరోసా ద్వారా కూలీలకు రూ.12 వేలలు, ఆటో కార్మికులకు రూ.12వేలు ఇస్తామన్న హామీలను విస్మరించారని తెలిపారు. అంతేకాక ఇందిరమ్మ కమిటీల పేరుతో కాంగ్రెస్ శ్రేణులకే ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేశారని విమర్శించారు. ఇక యూరియా లభించక రైతులు ఇబ్బంది పడుతున్నారని తెలిపారు. కాగా, త్వరలో జరిగే స్థానిక సంస్థల ఎన్నికల్లో అన్ని స్థానాల నుంచి పార్టీ శ్రేణులు పోటీకి సిద్ధం కావాలని సూచించారు. ఈ సమావేశాల్లో సీపీఎం నియోజకవర్గ, మండల కార్యదర్శులు మడుపల్లి గోపాలరావు, మద్దాల ప్రభాకర్‌రావు, నాయకులు దివ్వెల వీరయ్య, గొల్లపూడి కోటేశ్వరరావు, సగుర్తి సంజీవరావు, నల్లమోతు హన్మంతరావు, షేక్ లాల, దూదిగం బసవయ్య, మేడగాని తిరుపతిరావు, షేక్ నాగులమీరా తదితరులు పాల్గొన్నారు.

ఆత్మగౌరవ సభను విజయవంతం చేయండి

తెలంగాణ ఉద్యోగుల జేఏసీ చైర్మన్ లచ్చిరెడ్డి


కలెక్టరేట్ వద్ద ఉద్యోగులతో చైర్మన్ లచ్చిరెడ్డి

ఖమ్మం సహకారనగర్: పాత పెన్షన్ విధానాన్ని పునరుద్ధరించాలని కోరుతూ తెలంగాణ సీపీఎస్ ఉద్యోగుల సంఘం (టీజీ సీపీఎస్ ఈయూ) ఆధ్వర్యాన వచ్చేనెల 1న సీపీఎస్ ఉద్యోగుల ఆత్మ గౌరవసభ నిర్వహిస్తున్నట్లు టీజీ ఉద్యోగుల జేఏసీ చైర్మన్ లచ్చిరెడ్డి తెలిపారు. హైదరాబాద్ సుందరయ్య విజ్ఞాన కేంద్రం వద్ద నిర్వహించే ఈ సభను విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. కలెక్టరేట్‌కు గురువారం వచ్చిన ఆయన సీపీఎస్ ఉద్యోగులతో ముఖాముఖి నిర్వహించారు. సెప్టెంబర్ 1న జరిగే సదస్సుకు జిల్లా నుంచి సీపీఎస్ ఉద్యోగులు తరలిరావాలని కోరారు. తొలుత కలెక్టర్ అనుదీప్ దురిశెట్టిని మర్యాదపూర్వకంగా కలిశారు. టీజీ సీపీఎస్ ఈయూ రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు లింగమొళ్ల దర్శన్‌గౌడ్, నాగవెల్లి ఉపేందర్ మాట్లాడగా, ఉద్యోగ సంఘాల బాధ్యులు కె.రామకృష్ణ, బానాల రాంరెడ్డి, భీక్షం, గరికె ఉపేంద్రరావు, రవికుమార్, రామదాసు, కొరివి కృష్ణ పాల్గొన్నారు.

నాలుగు ఇసుక లారీలు సీజ్


లారీల పత్రాలను పరిశీలిస్తున్న ఎంవీఐ

సత్తుపల్లిటౌన్: అనుమతి లేకుండా ఇసుక తరలిస్తున్న నాలుగు లారీలను సత్తుపల్లి రవాణాశాఖ అధికారి గురువారం సీజ్ చేశారు. సత్తుపల్లి శివారులో వాహనాలు తనిఖీ చేస్తుండగా.. కొవ్వూరు నుంచి సత్తుపల్లికి అనుమతి లేకుండా ఇసుక తరలిస్తున్నట్లు గుర్తించారు. ఈమేరకు నాలుగు లారీలను సీజ్ చేసినట్లు రవాణాశాఖ అధికారి జే.ఎస్.శ్రీనివాసరావు తెలిపారు.

పశువుల పరిహారం స్వాహాపై విచారణ

తిరుమలాయపాలెం: మండలంలోని రాకాసితండాలో గత ఏడాది వచ్చిన వరదలతో పశువులు, మేకలు, కోళ్లు మృతి చెందగా, ప్రభుత్వ మంజూరు చేసిన పరిహారం పక్కదారి పట్టిందనే ఫిర్యాదులు అందాయి. ఈ మేరకు గురువారం జిల్లా వెటర్నరీ కార్యాలయ ఉద్యోగులు రాకాసి తండాలో విచారణ చేపట్టారు. ఇప్పటికే డీఆర్‌ఓ పద్మశ్రీ, ఉద్యోగులు శర్మ, బోడెపూడి శ్రీనివాసరావు, స్వర్ణలత విచారణ జరిపిన విషయం విదితమే. అయితే, చనిపోయిన జీవాలు, బాధితులకు అందిన పరిహారంపై పొంతన లేకపోవడంతో ఇంటింటి సర్వేకు నిర్ణయించారు. ఇందులో భాగంగా వెటర్నరీ కార్యాలయ ఏడీ శ్రీ రమణి, జీఓఎం స్వర్ణలత తదితరులు పరిహారం పొందిన వారికి ప్రస్తుతం ఉన్న పశువులు, మేకల వివరాలను నమోదు చేసుకున్నారు. అనంతరం తిరుమలాయపాలెం తహసీల్‌కు వెళ్లి వివరాలు సేకరించారు.

రోడ్డు ప్రమాదంలో పోస్టుమ్యాన్ మృతి

టేకులపల్లి: టేకులపల్లి మండలం మాలపల్లికి చెందిన పోస్ట్‌మ్యాన్ రోడ్డు ప్రమాదంలో మృతి చెందాడు. మాలపల్లికి చెందిన గుమ్మడి జానకీరామ్ (58) ప్రెగళ్లపాడులో పోస్టుమ్యాన్‌గా విధులు నిర్వర్తిస్తున్నాడు. బుధవారం రాత్రి బైక్‌పై వెళ్తుండగా ఎదురుగా వస్తున్న వాహనాన్ని తప్పించే క్రమంలో అదుపుతప్పి కింద పడగా తీవ్ర గాయాలయ్యాయి. దీంతో జానకీరామ్‌ను హైదరాబాద్ తరలిస్తుండగా మృతి చెందాడు.

ప్రేమబంధం.. ఏడాదిలో విషాదం

ప్రమాదంలో భర్త మృతి, పురిటినొప్పులతో ఆస్పత్రిలో భార్య

ఇల్లెందురూరల్: పెద్దలు అంగీకరించకున్నా ప్రేమ వివాహం చేసుకున్న వారి కాపురం ఏడాది పాటు సాఫీగా సాగింది. వారంలోగా పండంటి బిడ్డ జన్మించనుందనే ఆనందంలో ఉండగా గురువారం జరిగిన రోడ్డు ప్రమాదం విషాదాన్ని నింపింది. మండలంలో మామిడిగుండాలకు చెందిన సూర్నపాక వెంకన్న (25), గార్ల మండలం గుంపెళ్లగూడేనికి చెందిన శ్రీజ ప్రేమవివాహం చేసుకున్నారు. ప్రస్తుతం శ్రీజ తొమ్మిదో నెల గర్భిణి కాగా, ప్రసవం తేదీ సమీపించడంతో గురువారం ఆస్పత్రికి వెళ్లడానికి ఏర్పాట్లు చేసుకున్నారు. అయితే, శ్రీజ ఆధార్‌కార్డు గుంపెళ్లగూడెంలో ఉండడంతో తీసుకురావాలని బంధువులకు సమాచారం ఇచ్చారు. ఈమేరకు భర్త వెంకన్న ముందుగానే బైక్‌పై వెళ్లి వస్తుండగా ట్రాక్టర్ తగలడంతో కింద పడి అక్కడికక్కడే మృతి చెందాడు. అదే సమయాన ఆటోలో అక్కడకు వచ్చిన శ్రీజ స్పృహ కోల్పోయింది. దీంతో ఆమెను ఆస్పత్రికి తరలించారు. శ్రీజ పురిటినొప్పులతో ఆస్పత్రిలోనే ఉండగానే.. ఆమెకు చివరి చూపు దక్కకుండానే వెంకన్న అంత్యక్రియలు పూర్తి చేశారు.

రోడ్డు ప్రమాదంలో వృద్ధుడు మృతి

పెనుబల్లి: మండలంలోని పెనుబల్లిలో గురువారం జరిగిన రోడ్డుప్రమాదంలో వృద్ధుడు మృతి చెందాడు. లింగగూడెం గ్రామానికి చెందిన పెద్ద వెంకటేశ్వరరావు సైకిల్‌పై పెనుబల్లి ప్రభుత్వ ఆస్పత్రికి వస్తూ బీసీ కాలనీ వైపునకు యూ టర్న్ తీసుకోగా వీఎం బంజర్ నుంచి వస్తున్న కారు ఢీకొట్టింది. ఈ ఘటనలో తీవ్రంగా గాయపడిన వెంకటేశ్వరరావు అక్కడే మృతి చెందాడు. ఘటనాస్థలిని ఎస్‌ఐ వెంకటేష్ పరిశీలించి దర్యాప్తు చేపట్టారు.

చికిత్స పొందుతున్న యువకుడు...

చింతకాని: మండలంలోని సీతంపేటకు నారపోగు భరత్(19) పురుగుల మందు తాగగా చికిత్స పొందుతూ మృతి చెందాడు. ఇటీవల ఇంటర్ పూర్తి చేసిన భరత్ కొన్ని సబ్జెక్టుల్లో ఫెయిల్ కావటంతో తండ్రి మందలించాడు. దీంతో ఈనెల 17వ తేదీన పురుగుల మందు తాగగా చికిత్స చేయిస్తుండగానే మృతి చెందాడు. ఆయన తండ్రి మల్లికార్జున్‌రావు ఫిర్యాదుతో కేసు నమోదు చేసినట్లు ఎస్సై నాగుల్‌మీరా తెలిపారు.

మహిళపై గొడ్డలితో దాడి

ఖమ్మంరూరల్: మండలంలోని చింతపల్లికి చెందిన వల్లపు లీలావతిపై అదే గ్రామానికి చెందిన ఎనిగండ్ల బ్రహ్మం, ఆయన తల్లి సుగుణమ్మ గొడ్డలితో దాడి చేశారు. గ్రామంలో లీలావతి ఇంటి పక్కనే బ్రహ్మం ఇల్లు ఉండగా.. మట్టి కుప్ప విషయమై గురువారం ఘర్షణ జరిగింది. దీంతో మాటామాట పెరగగా పాతకక్షల నేపథ్యాన బ్రహ్మం తన తల్లి సుగుణమ్మతో కలిసి గొడ్డలితో లీలావతిపై దాడి చేశాడు. ఈ ఘటనలో గాయపడిన లీలావతిని ఖమ్మం తరలించి ఆమె భర్త ఫిర్యాదుతో కేసు నమోదు చేసినట్లు సీఐ ముష్క రాజు తెలిపారు.

గంజాయి, మారణాయుధాల పట్టివేత

- ముగ్గురిని అరెస్ట్ చేసిన పోలీసులు.. మరొకరు పరార్
- పిస్టల్, 5 రివాల్వర్లు, 40 బుల్లెట్లు స్వాధీనం
- నిందితులు తమిళనాడు, కేరళ రాష్ట్రాల వారుగా గుర్తింపు

పాల్వంచ: అక్రమంగా తరలిస్తున్న గంజాయిని ఎక్సైజ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు పట్టుకోగా, నిందితుల నుంచి మారణాయుధాలను స్వాధీనం చేసుకున్న ఘటన పాల్వంచలో చోటుచేసుకుంది. ఈ మేరకు ఎక్సైజ్ శాఖ డిప్యూటీ కమిషనర్ జి.జనార్దన్‌రెడ్డి గురువారం వివరాలు వెల్లడించారు. బుధవారం రాత్రి పాల్వంచలో వాహనాల తనిఖీ చేపట్టామని, అనుమానాస్పదంగా కనిపించిన ఐచర్ వ్యాన్, వోక్స్ వ్యాగన్ పోలో కారును తనిఖీ చేయగా ఆయా వాహనాల్లో రూ.53లక్షల విలువ చేసే 105 కేజీల గంజాయితో పాటు ఒక పిస్టల్, ఐదు రివాల్వర్లు, 40 బుల్లెట్లు, 12 ఖాళీ మ్యాగజైన్లు లభ్యమయ్యాయని చెప్పారు. వ్యాన్, కారుతో పాటు ముగ్గురిని అదుపులోకి తీసుకోగా, మరొకరు పరారయ్యాడని తెలిపారు. నిందితుల్లో కేరళ రాష్ట్రంలోని ఎర్నాకుళం జిల్లా అలువాకు చెందిన బిలాల్ వి.ఎస్, తమిళనాడు రాష్ట్రం తిరుచ్చి జిల్లా తిరియర్‌కు చెందిన శ్యాంసుందర్, విశ్వాంబల్ సముద్రమ్ గ్రామానికి చెందిన కాశీనందన్ సంతోష్ ఉన్నారని గుర్తించామని, అంతేగాక తిరుచ్చికి చెందిన జేమ్స్ పరారయ్యాడి వివరించారు. ఒడిశా నుంచి భద్రాచలం, ఖమ్మం, చెన్నై మీదుగా తిరుచ్చికి గంజాయి తరలిస్తున్నట్లు గుర్తించామని, తదుపరి విచారణ నిమిత్తం వారిని పాల్వంచ పోలీస్‌స్టేషన్‌లో అప్పగించామని చెప్పారు. అక్కడ విచారణ అనంతరం జ్యుడీషియల్ రిమాండ్ నిమిత్తం కోర్టుకు తరలించామని తెలిపారు. నిందితులను చాకచక్యంగా పట్టుకున్న ఎన్‌ఫోర్స్‌మెంట్ అసిస్టెంట్ కమిషనర్ జి.గణేష్, ఇన్‌స్పెక్టర్ ఎస్.రమేష్, సబ్ ఇన్‌స్పెక్టర్ సీహెచ్.శ్రీహరి రావు, సిబ్బంది ఖరీం, బాలు, సుధీర్, వెంకటేశ్వర్లు, హనుమంతరావు, విజయ్, హరీష్, వీరబాబు, ఉపేందర్‌ను జనార్దన్‌రెడ్డి అభినందించారు. కాగా, ఈ నలుగురిపై భారత ఆయుధ చట్టం కింద కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ సురేష్ తెలిపారు.

నిందితులది మొదటి నుంచీ నేరచరితే..

గంజాయి, మారణాయుధాలతో పట్టుబడిన నిందితులు కేరళలో గ్యాంగ్‌స్టర్ టీంగా చెలామణి అవుతున్నారని, కొచ్చిలో గ్యాంగ్‌స్టర్ బిలాల్‌పై 100కు పైగా కేసులు ఉండగా 28 సార్లు శిక్ష అనుభవించాడని తెలిసింది. ఎనిమిదేళ్ల శిక్ష అనంతరం ఇటీవలే విడుదలై మళ్లీ నేరాలకు పాల్పడేందుకు మధ్యప్రదేశ్‌లో మారణాయుధాలు కొనుగోలు చేశాడు. ఇక తమిళనాడుకు చెందిన శ్యాంసుందర్‌కు గంజాయి వ్యాపారంలో ఆరితేరిన వ్యక్తిగా పేరుంది. తమిళనాడుకు చెందిన జేమ్స్‌కు కూడా భారీ నేర చరిత్ర ఉన్నట్లు సమాచారం.

ఈ పోరాటం ప్రారంభం మాత్రమే..


మహాధర్నా పోస్టర్లను ఆవిష్కరిస్తున్న యూఎస్‌పీసీ బాధ్యులు

యూఎస్‌పీసీ రాష్ట్ర బాధ్యులు చావా రవి, తిరుపతి

ఖమ్మం సహకారనగర్: ఉద్యోగులు, ఉపాధ్యాయుల సమస్యలు పరిష్కరించాలని చేస్తున్న పోరాటాలు ప్రారంభం మాత్రమేనని, ప్రభుత్వం స్పందించకపోతే ఉద్యమాలను ఉధృతం చేస్తామని ఉపాధ్యాయ సంఘాల పోరాట కమిటీ(యూఎస్‌పీసీ) స్టీరింగ్ కమిటీ సభ్యులు, టీఎస్‌యుటీఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు చావా రవి, టీపీటీఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి తిరుపతి హెచ్చరించారు. ఖమ్మంలోని యూటీఎఫ్ కార్యాలయంలో గురువారం వారు మాట్లాడుతూ ప్రభుత్వం ఏర్పడి 20నెలలు దాటినా ఉపాధ్యాయ, ఉద్యోగుల సమస్యలు పరిష్కరించడంలో నిర్లక్ష్యం వహిస్తుందన్నారు. ఈమేరకు ప్రభుత్వం ఒత్తిడి తీసుకొచ్చేలా యూఎస్‌పీసీ ఆధ్వర్యాన ఈనెల 23న హైదరాబాద్ ధర్నాచౌక్‌లో మహాధర్నా నిర్వహిస్తున్నట్లు తెలిపారు. కాగా, నూతన జిల్లాలకు డీఈఓ పోస్టులు, ప్రతీ డివిజన్‌కు డిప్యూటీ ఈఓ, నూతన మండలాలకు ఎంఈఓ పోస్టులను మంజూరు చేయడమే కాక ఉపాధ్యాయుల ఏకీకృత సర్వీసు రూల్స్ రూపొందించి ఖాళీ పోస్టులను భర్తీ చేయాలని, సీపీఎస్ విధానాన్ని రద్దు చేయడమే కాక ఉద్యోగులు, రిటైర్డ్ ఉద్యోగుల పెండింగ్ బిల్లులు విడుదల చేయాలని డిమాండ్ చేశారు. అలాగే, విద్యారంగ సమస్యలన్నీ పరిష్కరించాలని పలుమారు విన్నవించినా ఫలితం లేక మహాధర్నా నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈకార్యక్రమంలో యూఎస్‌పీసీ నాయకులు ఎస్.విజయ్, రంజాన్, పారుపల్లి నాగేశ్వరరావు, ఏ.వీ.నాగేశ్వరరావు, వెంగళరావు, బుర్రి వెంకన్న, వల్లంకొండ రాంబాబు, రోజా, రామకృష్ణ, కోటేశ్వరరావు, ఉద్దండ్, నర్సింహారావు, శారద, హన్మంతరావు, పద్మజ, కోటేశ్వరరావు, షరీఫ్, శ్రీనివాసరావు పాల్గొన్నారు.

ఎస్‌జీఎఫ్ కార్యదర్శి నియామకం ఎప్పుడు?

- కార్యదర్శి లేకుండానే ఎంపిక పోటీలు
- జిల్లా వ్యాయాయ ఉపాధ్యాయుల్లో ఆందోళన



ఖమ్మం స్పోర్ట్స్: జిల్లా పాఠశాలల క్రీడల కార్యదర్శి నియామకంలో విద్యాశాఖ అధికారులు చేస్తున్న జాప్యం విమర్శలకు తావిస్తోంది. స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ కార్యదర్శిని ఎందుకు నియమించడం లేదో స్పష్టత ఇవ్వకపోగా.. ఎడతెగని జాప్యం చేస్తుండడంపై వ్యాయామ ఉపాధ్యాయులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. రాష్ట్ర క్రీడా పోటీలు క్యాలెండర్ ఖరారైనా పట్టించుకోకపోగా.. కార్యదర్శి లేకుండానే జిల్లాస్థాయి పాఠశాలల అండర్–17 బాలబాలికల వాలీబాల్ ఎంపిక పోటీలు నిర్వహించడం గమనార్హం. ఈ విషయమై కొందరికి మాత్రమే సమాచారం ఇవ్వడంతో ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలల నుంచి ఆశించిన స్థాయిలో వాలీబాల్ క్రీడాకారులు హాజరుకాలేదు.

సమాచారం కరువు

సుబ్రతో ముఖర్జీ కప్ పేరిట ఫుట్‌బాల్ టోర్నీని ఏటా రాష్ట్ర పాఠశాలల క్రీడా సమాఖ్య నిర్వహిస్తుంది. ఈ పోటీలు సెప్టెంబర్ మొదటి వారంలో జరిగే అవకాశముంది. కానీ జిల్లాలో ఇంత వరకు పోటీలకు సంబంధించి సమాచారం ఎవరికీ ఇవ్వకపోవడంపై అధికారుల తీరును క్రీడాకారులు, కోచ్‌లు తప్పుపడుతున్నారు. ఇలాంటి అన్ని సమస్యలకు ఎస్‌జీఎఫ్‌ఐ కార్యదర్శి లేకపోవడమే కారణంగా నిలుస్తున్న నేపథ్యాన అధికారులు స్పందించాలని పలువురు కోరుతున్నారు.

ఎవరికి ఇస్తారు?

పాఠశాలల క్రీడా కార్యదర్శి నియామకంలో విద్యాశాఖ మీనమేషాలు లెక్కిస్తుండడం గమనార్హం. జిల్లాలో సీనియర్ ఫిజికల్ డైరెక్టర్‌కే పదవి ఇచ్చే ఆనవాయితీ ఉండగా, ఈసారి జూనియర్లకు ఇస్తారనే ప్రచారంతో సీనియర్లు ఆందోళన చెందుతున్నారు. రాష్ట్రంలోని ఇతర జిల్లాల మాదిరిగానే ఇక్కడ కూడా నియమించాలే తప్ప కొత్త నిబంధనలు తీసుకురావొద్దని కోరుతున్నారు. విద్యాసంవత్సరం ప్రారంభమై మూడు నెలలు కావొస్తున్న కార్యదర్శి నియామకాన్ని పట్టించుకోకపోగా, ఇప్పుడు వాలీబాల్ ఎంపిక పోటీల నిర్వహణను జూనియర్లకు అప్పగించడంపై అనుమానాలు వెల్లువెత్తుతున్నాయి.

పుస్తక పఠనంతో లక్ష్య సాధన

భద్రాచలం ఐటీడీఏ పీఓ రాహుల్


కల్లూరులో విద్యార్థినులతో మాట్లాడుతున్న పీఓ

సత్తుపల్లిటౌన్/సత్తుపల్లి(కల్లూరు): ప్రస్తుత పోటీ ప్రపంచంలో ఉన్నత లక్ష్యాలు ఎంచుకోవడమే కాక వాటిని సాధించేలా పుస్తక పఠనాన్ని అలవాటుగా మార్చుకోవాలని భద్రాచలం ఐటీడీఏ పీఓ రాహుల్ సూచించారు. సత్తుపల్లి, కల్లూరులోని గిరిజన సంక్షేమ హాస్టళ్లను గురువారం ఆయన తనిఖీ చేశారు. ఈ సందర్భంగా డార్మెటరీలు, వంటగదులు, స్టోర్ రూం, పరిసరాలను పరిశీలించారు. మెనూ ప్రకారం వేడివేడి ఆహారమే విద్యార్థులకు వడ్డించాలని వార్డెన్లను ఆదేశించారు. నాణ్యమైన సరుకులే తీసుకుంటూ ఎప్పటికప్పుడు పర్యవేక్షించాలని తెలిపారు. అనంతరం విద్యార్థులతో మాట్లాడిన పీఓ రోజువారీ సబ్జెక్టులతో పాటు పోటీ పరీక్షల పుస్తకాలు చదవాలని సూచించారు. కాగా, కల్లూరు హాస్టల్‌ను సబ్ కలెక్టర్ అజయ్‌యాదవ్‌తో కలిసి పరిశీలించిన పీఓ రాహుల్ ఇటీవల విద్యార్థినులకు నాసిరకం ఆహారం అందించడంతో ఆస్పత్రి పాలయ్యారని, ఇలాంటివి జరగకుండా జాగ్రత్త వహించాలని ఆదేశించారు. వార్డెన్లు బి.రాములు, మాధవి, ఏడీహెచ్ఓ సైదులు, హెచ్‌ఎం శ్రీనివాస్ నాయక్ తదితరులు పాల్గొన్నారు.